# జీవితం

"లైఫ్ ఈజ్ ఎ మెనీ స్ప్లెండర్ట్ థింగ్" అన్నాడు డాక్టరు రాజారాం. మళ్ళీ తనే "జీవితం చాలా గొప్పది. ఎన్నో కాంతులు వెదజల్లుతుంది" అని కూడా అన్నాడు ఇంగ్లీషులో అన్న దానికి అనుబంధంగా తెలుగులో అన్నప్పుడు కొంచెం వంగాడు. ఆ వంగటం జీవితం పట్ల వినమ్ర భావంతో వంగి అన్నట్టుగా ఉంది.

వంగి డాక్టర్ నాయర్ గ్లాసులో మరో పెగ్గు విస్కీ వంచాడు. గ్లాసు, గ్లాసులో ద్రవం దీపపు కాంతి కిరణాలను కాస్త వక్రీభవించాయి. మరెంతో ప్రతిబింబించాయి.

డాక్టర్ నాయర్ ఆ ద్రవంలో మంచు ముక్కల్ని మెల్లిగా ఓ శస్త్ర నిపుణుడు విడిచి నట్టుగా జాగ్రత్తగా నైపుణ్యంతో ద్రవం ఉపరి తలాన్ని పెద్దగా కల్లోలపరచకుండా విడిచి పెట్టాడు. డాక్టర్ నాయర్ చూడటానికి ఓ మళయాళీ మన్మధుడిలాగా, రవివర్మ మన్మధుడు బొమ్మ వేస్తే ఇల్లాగే ఉంటాడని ఊహించుకోడానికి వీలుగా, మిసమిసలాడుతూ ఉన్నాడు.

"దేనికిది ఉపోద్ఘాతం ప్రొఫెసర్?" అని వినయంగా అడిగాడు.

"రేపు డాన్సు చేయబోతున్న కుమారి జీవిత మీకు తెలిసిన మీతో చదువుకున్న డాక్టర్ వసంత కూతురని చెప్పడానికి" అన్నాడు డాక్టర్ ప్రొఫెసర్ రాజారాం. క్లాసులో విద్యార్థులకి పాఠం పట్ల ఉత్సాహం, ఉత్కంఠ కలిగించే అలవాటు అతనికి ముప్పై సంవత్సరాలుగా ఉంది.

"వసూ కూతురా?!" అన్నాడు డాక్టర్ నాయర్. అంటున్నప్పుడు గొంతు కొద్దిగా వణికితే చేతిలో గ్లాసు మరింత వణికింది. అందులో ద్రవం తొణికింది.

"వసంత కెంతమంది పిల్లలు? ఈ పిల్ల ఎన్నోది?" నాయర్ కొద్దిగా కుతూహలంగా అడిగాడు.

"ఓన్లీ చైల్డ్" అన్నాడు రాజారాం.

"తండ్రి ఎవరు? అని అడిగాడు మధు అతను అడగటంలో అతని కుతూహలం బయటపడిపోయింది.

"మీకు తెలియదు. ఎందుకంటే ఆమె పెళ్ళయ్యేసరికి మీరిద్దరు చదువు పూర్తయి వెళ్లిపోయారు. షి మారీడ్ ఏన్ ఇంజనీర్. వాళ్ళింట్లోనే ఈమె ఉండి చదువుకొనేది. ఆమెకాయన దూరపు చుట్టం అనుకొంటాను"

"నాకాయన తెలుసు. పేరు గుర్తు లేదు" అన్నాడు నాయర్.

."ఆయన పేరు అప్పారావు. కాని ఆయన వసంత కంటే కనీసం పద్దెనిమిది ఇరవై ఏళ్ళు పెద్దవాడనుకొంటాను. ఆయన అల్లాంటి వాడనుకోలేదు" అన్నాడు మధు కొంచెం నెర్వస్‌గా

"ఎల్లాంటి వాడని నీ ఉద్దేశ్యం?" అని రాజారాం ఆశ్చర్యంగా అడిగాడు.

"వసంత పెళ్ళి నాటికి కడుపుతో ఉందని విన్నాను. పైగా ఆయన పెళ్ళైన వాడు ఆవిడని ఒకటి రెండు సార్లు నేనుచూసాను" అన్నాడు మధు. మధు సన్నగా పొడుగ్గా ఉంటాడు. ఈ మాటలంటున్నప్పుడు వెదరుబొంగులా కాక వెదురు బద్దలా ఊగాడు.

"పెళ్ళి నాటికా అమ్మాయి కడుపుతో ఉందని నీ కెల్లా తెల్సు?" అని ఆశ్చర్యంగా అడిగాడు రాజారాం.

మధు కొంచెం కలవరపడి తేరుకొని "విన్నాను. నమ్మకం అయినవాళ్లే చెప్పారు" అని సర్దుకొన్నాడు.

"నిజమే! కాని అప్పారావుగారు వసంతని మోసం చెయ్యలేదు. పెళ్ళి చేసుకొన్నారు" అన్నాడు రాజారాం. అని గతాన్ని నెమరు వేసుకొంటూ ఆలోచనలో పడి పోయాడు.

రాజారాం విశాఖపట్నం మెడికల్ కాలేజీలో టీచ్ చేస్తున్న రోజుల్లో మధు, నాయర్, వసంతలు  అతని వద్ద చదువుకొన్నారు. మధు, నాయర్‌లు ఒక బాచ్ వాళ్ళవగా, వసంత వాళ్ళకి రెండు సంవత్సరాలు జూనియర్, రాజారాం కొద్ది సంవత్సరాల క్రితం విశాఖ వదిలి కాకినాడ మెడికల్ కాలేజీకి మారాడు. కొద్ది రోజుల్లో పదవీ విరమణ చేయబోతున్నాడు. ఆ సందర్భంగా అతని విద్యార్థులు, విద్యార్థినులు అతని గౌరవార్థం ఓ రెండ్రోజుల కాన్ఫరెన్సు ఏర్పాటు చేసారు. రెండో రోజు సాయంత్రం వినోద కార్యక్రమంగా కుమారి జీవిత నృత్యం ఏర్పాటు చేసారు. ఆమె మద్రాసు నుంచి వచ్చింది.

ఈ వసంతను, అతను జీవిత పుట్టడానికి ముందు చావు నుంచి రక్షించి వసంతతో పాటు జీవిత ప్రాణం కూడా రక్షించాడు. వసంత ఎంతో అందమైన పిల్ల. గున్న మామిడిలాగా నిండుగా ఉండేది. గుండ్రంగా ఉన్న వాళ్ళు  అందంగా ఉండరు అన్న అభిప్రాయానికి వ్యతిరేకంగా ఉండేది. గుండ్రని ముఖం, గుండ్రని కళ్ళు గుండ్రని మూతి, గుండ్రని స్తనాలు. గుండ్రని పిరుదులు ఆమెకు అందాన్నే ఇచ్చాయి. అయితే ఆ పిల్ల సాధారణ మధ్య తరగతి కుటుంబం నుంచి రావటం వల్ల నిరాడంబరంగాను, పొదుపుగాను ఉండేది. ఆ రోజుల్లో మెడిసిన్‌లో సీటు రావటం అబ్బురం గాదు. అంత ఖర్చు పడి ఆ కోర్సు చదవగలగటమే అబ్బురం! వసంత కుటుంబానికి అప్పారావు భార్య కుటుంబానికి ఉన్న స్నేహం వల్ల వసంతకి ఇంజనీరు అప్పారావు ఇంట్లో ఉండడానికో గది దొరికింది. ఇవన్నీ రాజారాంకి తరువాత తెలిసాయి.

"మేస్టారు అలిసి పోయినట్టున్నారు. మనం తొందరగా ఈ పార్టీ ముగించేస్తే ఆయన ఇంటికి వెళ్ళిపోతారు" అన్నాడు నాయర్.

కాస్సేపటికి రాజారాం ఇల్లు చేరుకొన్నాడు. భార్య అన్నం వడ్డించింది. రాజారాం అప్పుడప్పుడు డ్రింక్ చేస్తాడు. డ్రింక్ చేసిన పూట తప్పకుండా ఇంట్లో మజ్జిగన్నం తింటాడు. అందులో రిటైర్‌మెంట్ సందర్భంలో దిగులు, సెంటిమెంట్ ఎఛీవ్‌మెంట్స్ ఇతరులు పొగడటం వల్ల కలిగిన ఎక్సైట్‌మెంట్ - ఇవన్నీ చేరి అతను మరో పెగ్గు ఎక్కువే తాగాడా రోజు.

భార్య వడ్డించగా భోంచేసి స్టడీలోకి వచ్చాడు. పైపు తీసి వెలిగించాడు. నిద్ర రాకపోవడంతో డ్రింక్ మత్తు కలిగించవచ్చు. మనస్సుని ఉద్రేకపరచనూ వచ్చు ఈ రోజు రాజారాం ఎక్సైటెడ్‌గా ఉన్నాడు. పైపుఆరి పోయింది. అగ్గిపెట్టె ఎక్కడ పెట్టాడో గుర్తులేదు. మెదడు మీద మందు ప్రభావం తెలుస్తోంది. వెతుకుతుంటే వసంత వ్రాసిన ఉత్తరం కనిపించింది. తీసుకొని మరోసారి చదివాడు.

"రెస్పెక్టెడ్ ప్రొఫెసర్"

మీ పదవీ విరమణ విషయం మీరెక్కడున్నారన్న విషయం చాలా గమ్మత్తుగా నాకు తెలిసిపోయినా మీ శిష్యురాలిగా నాకావార్త రాలేదు. దానికి రెండు కారణాలుండవచ్చు. మొదటిది నేను ఎక్కడున్నది నిర్వాహకులకి తెలియకపోవటం. రెండోది నేను డాక్టరుగా లబ్ద ప్రతిష్ఠురాలిని కాకపోవటం నన్ను డాక్టరుగా ఆంధ్రా ఎప్పుడో మర్చిపోయింది. ఏదో కొద్ది ప్రైవేటు ప్రాక్టీస్‌తో అజ్ఞాతంగా బతుకుతున్నాను. అటువంటి నాకు మీ పదవీ విరమణ సభ గురించి తెలియటం యాధృచ్ఛికమే అయినా చాలా ఆనందం కలిగించింది. చివరి రోజు కార్యక్రమానికి నేను హాజరవుతాను. చివరి రోజున మీ కార్యక్రమంలో డాన్సు చేస్తున్న చి॥ జీవిత తల్లిగా.

ఈ రోజున జీవిత ఇంత అయిదంటే కారణం ఏదైనా ఆ అవకాశం మాత్రం మీరు. గర్భస్థ ప్రాణాన్ని మీరు రక్షించటం వల్లనే కలిగింది. లేకపోతే మంటల్లో నాతోపాటు దాని బతుకు కాలిపోయి ఉండేది ఆ ఆలోచనే ఈ రోజున నాకు దుర్భరంగా ఉంది. ఆ రోజున ఆ సాహసం ఎలా చేసానో తెలియదు.

నిర్వాహకులు "పెద్దగా ఖర్చు భరించలేమని జీవిత నృత్య ప్రదర్శన చేయాలని తమ కోరిక అని, అందువల్ల కన్సెషన్ ఇమ్మని వ్రాసారు. అదీ మధ్య రెండు సినిమాలో డాన్స్ చేసింది. అందుకని మేము రేటు పెంచిన విషయం నిర్వాహకులు విని ఉంటారు. గాని వాళ్ళు నిర్వహిస్తున్న సందర్భం తెలిసిన వెంటనే మా అమ్మాయి చేత అంగీకారం తెలియజేయించాను. జీవితకి అప్పారావుగారు పెంపుడు తండ్రైతే మీరు నాకు పునర్జన్మ నిచ్చిన తండ్రి. రాకుండా ఎల్లా ఉంటాను! పిన్నిగారికి నమస్కారాలు చెప్పండి.

ఇట్లు

వసంత

రాజారాంకి కొంత మత్తుగా ఉన్నా అప్పారావు పెంపుడు తండ్రి అని వసంత వ్రాయటంలో ఏదో అంతరార్థం ఉందని అనిపిస్తోంది.

తనకి నలభై ఏళ్ళ వయస్సులో నిద్ర మాత్రలు మింగిన ఇరవై రెండేళ్ళ వసంతని తనకంటే రెండు మూడేళ్ళు పెద్దవాడైన ఒకాయన కార్లో తన దగ్గరికి తీసుకువచ్చాడు.

"స్లీపింగ్ పిల్స్ మింగింది డాక్టరు గారూ" అంటూ విషయం చెప్పాడు.

తను వసంత పొట్టంత వాష్ చేసాడు. కాస్సేపటికి ఆమెకి తెలివి వచ్చింది.

ఈ లోపల తీసుకువచ్చిన ఆయన తన పేరు అప్పారావని తను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నానని చెప్పాడు. వసంత తన భార్య కుటుంబానికి స్నేహితులైన వారి పిల్లని. పెద్దగా ఉన్న వారు కాకపోవటం వల్ల తమ ఇంట్లో ఒక గదిలో ఆమెను ఉంచి చదివిస్తున్నారని ఆ పిల్ల వండుకు తింటూ చదువుకొంటోందని చెప్పాడు.

వసంతకి తెలివి వచ్చింది. ముఖం వడలిపోయి ఉంది. గుండ్రంగా ఉండే వసంత కడుపు, నీటిలో తల్లకిందులుగా మునిగిన కుండ తేలిన భాగం నీటి మీద కనిపించే విధంగా కొద్దిగా పైకి గుండ్రంగా కనిపిస్తోంది. రొమ్ముల్లో కూడా తేడా తెలుస్తూనే ఉంది. డాక్టరైన రాజారాం సులభంగానే ఆమె కడుపుతో ఉందని పోల్చుకున్నాడు. డాక్టరైన రాజారాం ఆమె కడుపుతో ఉన్నందుకు అంతగా ఆశ్చర్యపోలేదు. ఇటువంటి సందర్భాలు నర్సుల విషయంలోను విద్యార్థినుల విషయంలోను అతనికి తగలకపోలేదు. కొద్దిగానే అయినా ఆయన ఆశ్చర్యపోయింది మెడిసిన్ చదువుతున్న వసంత తగు జాగ్రత్త వహించనందుకు.

"ఎందుకిలా చేసావు? యుహేవ్ నో రైట్ టు కిల్‌యువర్ సెల్ఫ్ ఆల్ ది మోర్ ఆనదర్ లైఫ్. అసలే ఉట్టి మనిషివి కాదు డాక్టర్లు ప్రాణం పొయ్యాల్సినవాళ్ళు" అన్నాడు. అతను ఎల్లవేళలా డాక్టరూ, మేష్టరూ!

"నాకూ దార్లు మూసుకుపోయాయి" అంది వసంత నీరసంగా

"చివరి దారి ఎబార్షన్ ఉంది కదా!" అన్నాడు రాజారాం.

అప్పారావు ఇబ్బందిగా కదిలాడు పరిస్థితి తెలిసి.

"ఇందులో నా తప్పూ నా భార్య తప్పూ కూడా ఉన్నాయి. వయస్సులో ఉన్న పిల్లను ఇంట్లో పెట్టుకోడానికి ఒప్పుకొంది నా భార్య. మేము తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోలేదు" అన్నాడు అప్పారావు అతను పరిస్థితికి నొచ్చుకొన్నాడు.

"ఇప్పుడేం చేస్తారు– అమ్మాయిని దేవుడి దయ వల్ల కాపాడగలిగాను. బిడ్డ విషయం ఆలోచించండి మీ ఇద్దరు పెళ్ళే చేసుకొంటారో, ఎబార్షనే శరణ్యం అనుకొంటారో" అన్నాడు రాజారాం. అనటంలో కొద్దిపాటి విసుగే కాని కోపం లేదు.

"నేను పెళ్ళి చేసుకోవటమేమిటి? నేను పెళ్ళయినవాడిని. మా ఆవిడ జబ్బుతో ఉన్నమాట నిజమే కాని బతికే ఉంది" అన్నాడు అప్పారావు.

మర్నాడు వసంతని తను డిస్‌ఛార్జి చేసాడు. అప్పారావు వచ్చి తీసుకువెళ్ళాడు. మరో రెండు నెలలకి అప్పారావు వసంతని గుళ్ళో పెళ్ళి చేసుకొన్నాడు. పెళ్ళయిన అయిదు నెలలకి జీవిత పుట్టింది. జీవితకి రెండో మూడో ఏళ్ళ వయస్సున్నప్పుడు వాళ్ళు విశాఖ విడిచి వెళ్ళిపోయారు. తను మరి కొన్నేళ్ళకి కాకినాడ వచ్చేసాడు. మళ్ళీ ఇన్నేళ్ళకి తను వసంతని చూడబోతున్నాడు.

రాజారాం పైపు కాల్చటం పూర్తి చేసి వక్కపొడి వేసుకొని బెడ్‌రూంలోకి వెళ్ళాడు. అక్కడ మెత్తని పక్కమీద మెత్తని వంటితో యాభై అయిదేళ్ళ అందగత్తె నిద్దరపోతోంది. డాక్టర్ వర్మ అంటూ ఉంటాడు. "తాగకండి తాగితే తాగినప్పుడు స్మోక్ చెయకండి. తాగి స్మోక్ చేశాక ఎక్కువ కొవ్వు పదార్థాలు ఫ్రైడ్ చికెన్ గట్రా తినకండి ఈ మూడు తప్పులను మీ గుండె ఓ మోస్తరుగా కాస్తుంది. నాల్గో తప్పు.... అదే సెక్స్ – అది తప్పకుండా ఎవాయిడ్ చెయ్యండి. ఈ తప్పు, మీ గుండెకాయ కాయదు"

ఒకసారి తను అడిగాడు – "ఫ్రైడ్ స్టఫ్ మానేస్తే సెక్స్‌లో పార్టిసిపేట్ చెయ్యవచ్చా?" అని.

"ట్రై చేసి చూడండి!" అన్నాడు డాక్టర్ వర్మ.

అప్పటి నుంచి డాక్టర్ రాజారాం ఎక్స్‌పెరిమెంట్ చేస్తూనే ఉన్నాడు. తన గుండెకాయ తన తప్పులు కాస్తూనే ఉంది. భార్య మీద కోర్కెతో రాజారాం చెయ్యి వేసాడు. చెయ్యి వేస్తూ –

"అప్పారావు మొదటి భార్య, అతని రెండో పెళ్ళి నాటికి టర్మినల్లీ ఇల్‌. భార్య చావబోతోంది కదా అని మనిషిలో కోర్కెలు చావవు. అప్పటికి అప్పారావు వయస్సు నలభై రెండు కాబోలు అరవై యేళ్ళ వయస్సులో తనకి కోర్కె చావలేదు. అతనికి నలభై యేళ్ళ వయస్సుకే కోర్కెలెలా చస్తాయి" అనుకొన్నాడు.

ఇలా అనుకొన్న ఒకసారి తన భార్యతో తను అనుకొన్నది అన్నాడు రాజారాం. ఆవిడవెంటనే, "ఆడదాని మొగుడు జబ్బుతో ఉన్నా ఆఖరికి చచ్చిపోయినా దానికి కోర్కెలుండరాదు. మగవాళ్ళు కోర్కెలు తీర్చుకోడానికే పుట్టారు. పాపం" అంది. ఆ అనడంలో ఒక వాడి, ఓ విసురూ, ఓ మురిపెం ఓ ముచ్చటా ఉన్నాయి.

"స్త్రీలకి కూడా కోర్కెలుంటాయని అటువంటి పరిస్థితుల్లో వాళ్ళకి తీర్చుకోవాల్సిన అవసరం ఉంటే తీర్చుకోవచ్చుని అల్లా తీర్చుకొన్న స్త్రీలని నేరస్తులని చూసినట్లు చూడరాదని నువ్వు వాదిస్తే నేను నీతో పూర్తిగా ఏకీభవిస్తాను" అన్నాడు రాజారాం.

"నేను ఛస్తే అనను. అల్లా కోర్కెలుండి తీరని స్త్రీల కోర్కెలు తీర్చడానికి మీ లాంటి పెద్ద మనుషులందరూ తయారైపోతారు. వాళ్ళకి కోర్కెలు తీర్చగల భార్యలు లేకపోతే ఏమోగాని అందరు మగవాళ్ళు, తయారయిపోతే ఒప్పుకోను. మీకా ఛాన్సు లేదు" అంది అందులో ఒక చనువు, ఒక బెదిరింపు, ఒక సరసం ఉన్నాయి.

అందుకే రాజారాంకి భార్యంటే ప్రేమా, గౌరవం, ఆమె భార్య మాత్రమే కాదు. జీవిత సఖి. అందుకే ఇప్పటికీ ఆమె పట్ల అతనికి అనురక్తి, కోరిక.

ఆమె రాజారాం వైపు తిరిగి పెనవేసుకొంటూ, "చుట్ట కంపు" అంది అందులో విదిలింపు లేదు. కవ్వింపేగాని.

మర్నాడు కాన్ఫరెన్సు ముగిసి రాజారాం అభినందన సభ జరిగినప్పుడు రాజారాం పూర్వ విద్యార్థినిగా వసంత రాజారాం దంపతులకి పట్టు బట్టలు పెట్టి.

"రాజారాంగారు నాకు మరో జీవితం ఇచ్చినవారు. నాకు తండ్రి లాంటి వారు ఆయన లేకపోతే ఈ రోజున నేను లేను. కాస్సేపట్లో మీ ముందు నృత్యం చెయ్యబోతున్న జీవిత ఉండేది కాదు. మేము ఆయన కంతలా ఋణపడి ఉన్నాం. ఈ కార్యక్రమంలో పాల్గొనే అదృష్టం మాకు కలిగింది. దీనివల్ల ఆయన ఋణం కొద్దిగా తీర్చుకొనే అవకాశం దొరికింది" అంటూ అతనికి పాదాభివందనం చేసింది.

"జీవితం ఒక మహా సముద్రం లాంటిది. దాని ముందు నిలబడినప్పుడు కొందరు ఆ అలల అలజడికి బెదిరిపోతారు. కొందరు దాని లోతుల్ని తలచుకొని సంభ్రమం చెందుతారు. కొందరు అనుక్షణం మారుతూ ఉండే దాని అందాలని చూసి తన్మయం చెందుతూ ఉంటారు. కెరటాల తీరం నుంచి కొంచెం లోపలికి వెళ్ళగలిగిన వాళ్ళకి సముద్రం నిబ్బరంగా ఓ తపస్విలాగా కనిపిస్తుంది. నా జీవితం కెరటాల దశ దాటిపోయి ఇక బయటికి నిశ్చలంగా కనిపించే దశకి చేరుకొంటోంది. ఈ దశలోను అండర్ కరెంట్స్ ఉంటాయి. కాని నేను నా భార్య సహచర్యంలో దాన్ని తట్టుకోగలనని, మా జీవితంలో అమృతం పుట్టే సమయం అసన్నమైందని దాన్ని కోరి దరి చేరినవారికి అందించగలమని నమ్ముతున్నాను. అంటే వాన ప్రస్థం మొదలైంది మా జీవితంలో మా అనుభవంతో మేమివ్వగల సలహాలు ఏమైనా ఉంటే వాటిని ఎవరైనా కోరితే ఇస్తామని, కోరని సలహాలు ఇవ్వమని చెప్తూ సెలవు తీసుకొంటున్నాం" అని తన ఉపన్యాసాన్ని రాజారాం ముగించాడు. సభలో కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

చివరి కార్యక్రమంగా జీవిత నృత్యం ప్రారంభమైంది. జీవిత నృత్యం మిరిమిట్లు కొలుపుతున్న కాంతిరేఖలు వెదజల్లింది జీవిత తల్లి లాగానే అందమైంది. రవివర్మ బొమ్మల్లోని ప్రశాంతత ఆమె ముఖంలో ఉంది. కాని డాన్సు చేస్తున్న సమయంలో అది ఎన్నో భావాలు పలికింది. నృత్యం ముగిసింది.

రాజారాం, మరికొంత మంది పెద్దలు జీవితని కన్న తల్లిదండ్రుల జన్మ ధన్యమైనదని పొగిడారు.

దానికి జవాబుగా అప్పారావు-

"నేను ఎన్నో బ్రిడ్జిలు కట్టించాను ఎంతోమంది వాటిపై రోజూ ప్రయాణిస్తున్నారు. కాని నన్ను ఎవరూ నా ఎదుటగా కీర్తించలేదు. చాటుగా కీర్తించిన దాఖలాలు కూడా

లేవు. కాని జీవిత వల్ల నేను కీర్తి పొందుతున్నాను. వింటున్నాను. కళలకు ప్రజల్లో ఉన్న గౌరవం ఏమిటో తెలుసుకొన్నాను. అటువంటి కూతుర్ని నా కిచ్చిన వసంతకి నేను ఋణపడి ఉన్నాను. అటువంటి కూతుర్ని నా కిచ్చిన నాకు కనపడని, తెలియని భగవంతుడికి కూడా నేను ఋణపడి ఉన్నాను. నేను చేసిన మంచి పని జీవితకి నేను తండ్రినవటమే! ఆమె కళారాధనకి చేతైనంత చేయూత నివ్వటమే! నిజానికి ఈ రోజున నాకు వచ్చిన కీర్తికి నేనెంత వరకు అర్హుడినో తెలియదు. ఒక విధంగా చూస్తే నా కంటే బాగా చిన్న దైన వసంతని, ఆమె వల్ల కలిగిన జీవితని నేను ప్రేమించటం నా స్వార్థమే. నేను దాన్ని ఘనకార్యంగా అనుకోవటం లేదు" అన్నాడు.

అతని యోగ్యత గురించి అతను బిడియంగా చెప్పుకోటం అందర్నీ ఆకట్టుకొంది.

కార్యక్రమం ముగిసి వసంత కుటుంబం గెస్టు హౌస్‌కి చేరుకొన్నారు. అక్కడ మధుని చూసి వసంత చిన్న నవ్వు నవ్వి "మీరు రావటం చాలా ఆనందంగా ఉంది" అని భర్తతోనూ కూతురితోను–

"వీరు నాకు కాలేజీలో రెండేళ్ళు సీనియర్ కాస్సేపు పాత రోజుల జ్ఞాపకాలు నెమరు వేసుకొంటాం. మీరు లోపలికి వెళ్ళి స్నానాలు అవీ చెయ్యండి ఈ లోపల" అని తను లాంజ్‌లో మధుతో కూర్చుంది.

అక్కడ వాళ్ళిద్దరి మధ్యా కాస్సేపు మౌనం అడ్డు నిలిచాక వసంతే అడిగింది.

"పెళ్ళీ అదీ చేసుకొన్నారా?" అంటూ.

"అయింది"

"మీ ఆవిడకి పిల్లలా?" అంది నవ్వుతూ. "ఏమల్లా అడుగుతున్నారు? అందరికి మీ లాంటి భార్యలు దొరకరు" అన్నాడు కొంచెం కరకుగా.

"ఉత్తినే! తల్లి సత్యం, తండ్రి నమ్మకం అంటారు కదా! అందుకు" అంది నవ్వుతూ.

"సాధారణంగా తండ్రి కూడా సత్యమే ఇంతకూ జీవితకు తండ్రి అప్పారావుగారన్న మాట" అన్నాడు.

"కాదు. తండ్రి మీ లాంటి మరో ప్రేమికుడు! నేను కడుపుతో ఉన్నానని తెలియక ముందే జారుకున్నాడు. మీరు ప్రేమంటూ నా చుట్టూ తిరిగి నేను కడుపుతో ఉన్నానని తెలుసుకొని నా నుంచి తప్పు కొన్నారు" అని కాసేపాగి "పెద్ద తేడా ఏం లేదు" అని మధు ముఖంలోకి చూసి నవ్వింది.

"నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలని అనుకొన్నాను. మీరు నన్ను ప్రేమిస్తున్నారని అనుకొని మా అమ్మా నాన్నలతో మిమ్మల్ని పెళ్ళి చేసుకొంటానని చెప్పి ఒప్పించాను. మీరు మరొకరి వల్ల ప్రెగ్నెంటయ్యారని తెలిసాక తప్పుకొన్నాను. ఆ పరిస్థితుల్లో మిమ్మల్ని పెళ్ళి చేసుకోగల ఆదర్శమూర్తిని కాను కనక" అన్నాడు. అందులో నిజాయితీ ఉంది. తన్ను తాను సమర్థించుకోడం ఉంది.

"పోన్లెండి మీరు, మీ ఆవిడ, పిల్లలూ బాగున్నారు కదా! నాకు మీ మీద కోపం లేదు. ఆ క్షణాన్న నిరాశపడి ఆత్మహత్యా ప్రయత్నం చేసాను. కాని రాజారాం గారి దయ వల్ల, అప్పారావుగారి శ్రద్ధ వల్ల రక్షింపబడ్డాను. ఆ తరువాత జీవితం ఒక ప్రేమకి పరిమితం కాదని, మరొకరి వల్ల గర్భంధరించిన వాళ్ళని భరించగల భర్తలు ప్రపంచంలో కొందరుంటారని అర్థమైంది. ఈ రోజున నా కూతుర్ని ఆ రోజున అంత మొందించ నందుకు గర్విస్తున్నాను కూడా!" అంది వసంత. ఆమె కంఠంలో జరిగిన దాని పట్ల విచారం లేదు.

"అంత గోప్యంగా మీరు ఎఫైర్ సాగించగలరని మీతో పరిచయం ఉన్న వాళ్ళెవరూ అనుకోలేరు" అన్నాడు మధు

తనకి అపరాధ భావం లేదని ఆమెకి తెలియ చేయాలనీ ఉంది, నొప్పించాలనీ ఉంది అతనికి.

"ప్రయత్నించి గోప్యంగా ఉంచలేదు. ఎందుకంటే జీవిత బయెలాజికల్ తండ్రితో నాకు పెళ్ళవుతుందనుకొన్నాను. అనుకొన్నవన్నీ జరగవు" అంది నొచ్చుకోకుండా.

"ఇంతకూ ఆ ప్రబుద్ధుడెవరు?" అని అడిగాడు మధు కుతూహలంగా.

"తెలుసుకోడం వల్ల మీకూ, తెలియచేయటం వల్ల నాకు ప్రయోజనం ఉందని అనుకోను" అంది కొంచెం కటువుగా.

మధు తీరని కుతూహలంతో లేచాడు. అతనికి అంత అందమైన వసంతను తనదిగా చేసుకోలేని పరిస్థితుల మీద అక్కసుగా ఉంది. తనకి జీవితలాంటి అందమైన కూతురు కలిగేది కదా అన్న భావన ఉంది. కాని జీవితంలో కావాలనుకొన్నవన్నీ అమరవు.

మధుని పంపించి వసంత లోపలికి వెళ్ళి స్నానం చేసి వచ్చేసరికి అప్పారావు ముగ్గురికి భోజనం టేబుల్ మీద సర్ది ఉంచాడు.

అప్పారావు కొద్దిగా పెద్ద వాడైనా అనుకూలుడైన భర్త. అర్థం చేసుకొనే భర్త.

"మీరు నా అదృష్టం కొద్దీ దొరికారు" అంది అప్పారావుతో వసంత పూర్వం ఎన్నో సార్లు అన్నట్టుగానే కూతురి సమక్షంలో అప్పారావు దానికి సమాధానం చెప్పక నవ్వి ఊరుకొన్నాడు.

రాజారాం, వసంతని ఆత్మహత్యా ప్రయత్నం నుంచీ రక్షించాక వసంత గర్భానికి తానే కారకుడన్నట్లు మాట్లాడ్తుంటే ఆమె గర్భవతి అని తెలియటం వల్ల కలిగిన ఆశ్చర్యం వల్ల నోరు మూగపోయింది.

ఇంటికి వెళ్ళాక భార్యతో వసంత గర్భవతి అని చెప్తే ఆమె, కొంచెం సేపు మౌనం వహించి, "మీకు ఎన్నాళ్ళగానో ఏ సుఖం ఇవ్వలేకపోతున్నాను. మీరు ఆరోగ్యవంతులు. మీకా అవసరం ఉంటుందని నాకు తట్టలేదు. వసంత మంచిపిల్ల. అందమైనది. చదువుకొన్నది. అయిందేదో అయింది. ఆమెను పెళ్ళి చేసుకోండి" అని తన సంగతి ఎన్నాళ్ళ బట్టీ తెలిసి కూడా వసంత గర్భానికి తాను కారకుడై ఉంటాడని నమ్మి అన్నది.

మొదట్లో ఇద్దరు తనని గురించి అల్లా భావించినందుకు బాధ పడినా, వసంత అందమైనదన్న విషయం, తనామెను పెళ్ళి చేసుకోవటంలో ఏమీ విడ్డూరం వారికి కనిపించలేదని అర్థం చేసుకోవటంతో ఆ విధంగా ఆలోచించటం మొదలుపెట్టాడు. తనకి సెక్సు కావాలి. వసంతకి రక్షణ కావాలి తను పెళ్ళి చేసుకోవడానికి తన భార్య సమ్మతించినా ఏ పెళ్ళి కాని సాధారణ అందకత్తో తనకి దొరుకుతుంది. ఇంత అందమైన చదువుకొన్న చిన్న భార్య దొరకటం అసంభవం. తనకి పెళ్ళయి ఇన్నాళ్ళయినా సంతానం కలగలేదు. తనకి స్పెర్మకౌంటు తక్కువన్నాడో డాక్టరు. తనూ, భార్య ఎన్నోసార్లు ఎవర్నైనా పెంచుకొంటే బావుంటుందేమో అని అనుకొన్నారు. కాని భార్య అనారోగ్యం వల్ల ఆ ఆలోచన మానుకొన్నారు. ఆ కాడికి వసంత సంతానాన్నే తనెందుకు పెంచుకోకూడదు? స్వార్థమైన ఆలోచనే అయినా దూడతో పాటు ఆవు ఉచితంగా వస్తుంది. తను ఆదర్శాలు వల్లించక్కర్లేదు., కేవలం ప్రాక్టికల్‌గా ఆలోచించినా ఇది ఒక పరిష్కారంలా కనిపిస్తోంది.

ఇన్ని విధాల ఆలోచించి ఇంజనీర్ అప్పారావు ఇంటికి వచ్చిన వసంతతో అన్నాడు.

"నువ్వు మా ఇంట్లోనే ఉన్నా నిన్ను నేనిన్నాళ్ళు గమనించలేదు. నువ్వు అందగత్తెవని, వయస్సులో ఉన్నావని, ఇటువంటి పరిస్థితులు రావచ్చునని అనుకోలేదు. నీ గర్భానికి కారాణం నేనేనని డాక్టరు రాజారాం అనుకొన్నారు. ఈ విషయం తెలిసి మా ఆవిడ కూడా అనుకొంటోంది. నేను కాదని అనలేదు. నీ కిష్టమైతే కర్తృత్వం నా మీద వేసుకొని నిన్ను పెళ్ళి చేసుకోడానికి సిద్ధమే. అది ఇష్టం లేకపోతే బిడ్డ పుట్టాక ఆ బిడ్డను మాకిచ్చి నువ్వు వేరే పెళ్ళి చేసుకో. దానికీ నేను సిద్ధమే" అన్నాడు.

అప్పారావుని పెళ్ళి చేసుకొంటే తన బిడ్డకి తను దూరం అవ్వక్కర్లేదన్న లోకజ్ఞానంతో వసంత అప్పారావుని గుళ్ళో పెళ్ళి చేసుకొంది. ఆ పెళ్ళి తెలిసి ఆమె తల్లి దండ్రులు అప్పారావుని, అతని భార్యని నానా మాటలు అన్నారు. ప్రపంచం అంతా జీవితని అప్పారావు సంతానం గానే గుర్తించింది. అతనెప్పుడూ కాదనలేదు, ఆమె తండ్రెవరని వసంతని అడగలేదు.

వసంతని కలుసుకోడానికి ఆ క్రితంరోజు కుదరని నాయర్ రైలు స్టేషన్‌కి వెళ్ళాడు.

"చాలా బాగా డాన్స్ చేసావు కుట్టి, అన్నాడు జీవితతో. జీవిత అందంగా నవ్వి "థాంక్స్" అంది. వసంతకా పొగడ్త సంతోషాన్నిచ్చింది.

"నీ కూతురికి గ్రేట్ ఫ్యూచర్ ఉంది అన్నాడు నాయర్.

రైలు కూత వేసి బయల్దేర్తుంటే 'అవును - మన కూతురికి గొప్ప ఫ్యూచర్ ఉంది' అనుకొంది వసంత.

వసంతతో దూరం పెంచుతూ పోతున్న ట్రెయిన్‌ని చూస్తూ నిలబడి పోయాడు డాక్టర్ నాయర్.